## క్లుప్తంగా

### నేడు గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణం

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భోగి పండుగ సందర్భంగా శ్రీ గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు చాటకొండు సుబ్రమణ్యం (రత్న), జనార్దనశెట్టి తెలిపారు. ఆలయ అర్చకులు కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు, కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

### రేపు వెల్లాలలో పార్వేట

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి మంగళవారం పార్వేట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కేవీ రమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి ఆదివారం ఒక తెలిపారు. మకర సంక్రాంతి రోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామిని హనుమత్ వాహనంపై గంగా పార్వతి సమేత శ్రీభీమలింగేశ్వర స్వాములను నంది వాహనంపై ఊరేగింపుగా బయలుదేరుతారన్నారు. ఈ మహోత్సవం మండలంలోని వెల్లాల గ్రామం నుంచి గోపాయపల్లె, నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని మల్లెవేముల, రాజుపాళెం మండలంలోని దద్దనాల, పగిడాల, కుమ్మరపల్లె, పర్లపాడు గ్రామాల మీదుగా తిరిగి వెల్లాలకు చేరుకుంటుందన్నారు. పార్వేట మహోత్సవాన్ని ఆయా గ్రామస్తులు, భక్తులు వచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి రావాలని, నిబంధనలు పాటిస్తూ ఉండాలని చెప్పారు.

### పార్టీకి పూర్వవైభవం తెస్తాం


సగిలి సుదర్శన్

కలసపాడు : పార్టీకి పూర్వవైభవం తెస్తామని వైఎస్సార్‌సీపీ కలసపాడు మండల అధ్యక్షుడు సగిలి సుదర్శన్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలసపాడు మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడుగా సగిలిసుదర్శన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా నియమించినందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కృతజ్ఞతలు తెలిపారు.

### అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

అట్లూరు: వైఎస్సార్ జిల్లా బద్వేలు మండలం చింతలచెరువు పంచాయతీకి చెందిన అంబవరం శివారెడ్డి, సుబ్బలక్షుమ్మల కుమారుడు డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డికి స్వామివివేకానంద యూత్ ఐకానిక్ అవార్డు – 2025 లభించింది. అఖిల భారతీయ యోగా శిక్షక్ మహాసంఘ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలోని లజపత్‌భవన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డికి ఉత్తరప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ డాక్టర్ దినేష్‌శర్మజీ చేతులమీదుగా అవార్డును అందజేశారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కలసపాడు జెడ్పీ హైస్కూల్ 1990-91 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నాటి విద్యార్థులు ఘనంగా సన్మానించి మూడు రోడ్ల కూడలి నుంచి పాఠశాల వరకు ఊరేగింపు చేశారు. అనంతరం సీఎంఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివి 34 సంవత్సరాల తర్వాత అందరూ ఒక్కసారిగా కలవడం చాలా సంతోషంగా ఉందని, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో గురువులు మాలకొండయ్య, సుబ్బారెడ్డి, యేసుదాసు, కొండయ్య, లక్ష్మినారాయణ, రామసుబ్బమ్మ, శేషయ్య, పూర్వపు విద్యార్థులు పెద్దిరెడ్డిక్రిష్టారెడ్డి, వెంకటరమణ వరప్రసాద్ (పురోహితుడు), వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యం, నారాయణ, వీరయ్య, దేవసాని క్రిష్ణకుమారి, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని చైతన్య హైస్కూల్‌లో 2005–06 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దువ్వూరులోని కానాల మినీ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థులందరూ కలిసి గెట్ టు గెదర్ నిర్వహించారు. తాము చదువుకునే సమయంలో జరిగిన సంఘటనలను ఒకరికొకరు పంచుకున్నారు. తామందరం ఇలా ఒక చోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

# నవతరానికి వివేకవాణి


కాశినాయన : దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు


ప్రొద్దుటూరు కల్చరల్ : ఉపాధ్యాయ సేవా కేంద్రంలో..


పోరుమామిళ్ల: శోభాయాత్రలో చిన్నారులు


బద్వేలు అర్బన్ : స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామకృష్ణ సేవాసమితి సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్వామి వివేకానంద పేరు తలచుకుంటే ఉత్తేజం ఉరకలేస్తుందని, తన ప్రసంగాలతో నవతరానికి ఆయన దిశానిర్దేశం చేశారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, ప్రముఖ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీరాములపేట వీధిలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, కోశాధికారి గంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, ఆర్‌సీపీఈ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పంజగల మధుసూదన్‌బాబు, ఉపాధ్యాయులు ఓబులేసు, సుధాకర్, రామచంద్రారెడ్డి, బాబా, షేక్షావలి పాల్గొన్నారు.

- మండల పరిధిలోని కామనూరు కడప రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలు ఆదివారం రామకృష్ణ మందిరంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.
- స్వామి వివేకానంద జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వివేకానందక్లాత్ మార్కెట్‌లో ఉన్న వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, ఓబులేసు, హేమంత్ పాల్గొన్నారు.

**పోరుమామిళ్లలో..**

పోరుమామిళ్ల: పట్టణ ప్రధాన రహదారిలోని వివేకానంద భవన్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కొండారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**రోగులకు పండ్లు పంపిణీ**

ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. యువతకు వివేకానంద పుస్తకాలు పంపిణీ చేశారు. పల్లెంశెట్టి పండరి, ధర్మవీర్ కశ్యప్‌రెడ్డి, ధర్మవీర్ రాఘవేంద్రారెడ్డి, అపస్ అధ్యక్షుడు చెన్నయ్య, గురుమూర్తి, వెంకట్రామిరెడ్డి, నాగేంద్రబాబు, జయరామ్ పాల్గొన్నారు.

**శోభాయాత్ర**

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని సిద్దవరం హరిజనవాడలో జనహిత ఏకల్ పాఠశాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. వివేకానంద వేషధారణతో విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

**వివేకానంద అడుగుజాడల్లో నడవాలి**

చాపాడు: బలమే జీవనం–బలహీనతే మరణమని చెప్పిన స్వామి వివేకానంద అడుగుజాడల్లో యువత నడవాలని ఏకల్ అభియాన్ అంచల్ జిల్లా ఉపాధ్యక్షురాలు సి.రమాదేవి పేర్కొన్నారు. కడప అంచల్ ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన వేషధారణ, చిత్ర పటంతో మండలంలోని నక్కలదిన్నె, చియ్యపాడు, గుంతచీపాడు, వెదురూరు గ్రామాలలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజులుగా చాపాడు మండలంలోని వివిధ గ్రామాలలో స్వామి వివేకానంద నినాదాలతో శోభాయాత్ర చేస్తున్నామని, యువత వివేకానందుడి మార్గంతో నడవాలని సూచించారు. మాతాజీ వరలక్ష్మి, నాగతులసి, చంద్రకళ, ఈశ్వరమ్మ, సుజాత, వెంకటలక్ష్మీదేవి, పుల్లమ్మ, సాదిక్, ఓబులేసు పాల్గొన్నారు.

కాశినాయన : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద ఫౌండేషన్ గౌరవ ప్రతినిధి గురుమూర్తి, వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఓబుళాపురం గ్రామ సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న స్వామివివేకానంద సేవాశ్రమంలో ఆదివారం వివేకానందుని 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వరికుంట్ల ఎస్టీకాలనీలోని 80 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామతులసి, నాగేంద్ర, సురేష్, పకీరారెడ్డి, హరి, కిరణ్, కుమార్, జయరామ్, శ్రావణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

**యువతకు ఆదర్శంగా స్వామి వివేకానంద**

బద్వేలు అర్బన్ : భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన స్వామివివేకానంద నేటి తరం యువతకు ఆదర్శమని బద్వేలు పట్టణాభివృద్ధి సొసైటీ గౌరవాధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, వ్యవస్థాపక అధ్యక్షులు బి.గురుమూర్తి, అధ్యక్షులు నానబాలవెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్వామివివేకానంద జయంతిని ఆదివారం పట్టణాభివృద్ధి సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాభివృద్ధి సొసైటీ గౌరవ సలహాదారులు కె.వి.సుబ్బారావు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, సభ్యులు వెంగలరావు, శ్రీనివాసులు, వెంకట్ పాల్గొన్నారు.

**ఆధ్యాత్మిక శిఖరం స్వామి వివేకానంద**

భారతీయులందరూ గర్వంగా చెప్పుకోదగిన ఆధ్యాత్మిక శిఖరం స్వామివివేకానంద అని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచపూడి సాయికృష్ణ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవం సందర్భంగా ఆదివారం రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో అనంతగిరి క్షేత్రంలోని కార్యాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు రామయణము, వివేకానంద జీవితచరిత్రల మీద టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఎస్ఎస్ఏ మాజీ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మార్కారెడ్డి, రామకృష్ణ సేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకయ్య, అమరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## విమర్శలు వద్దు.. విచారణ చేయించండి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి తనపై అనేక అవినీతి ఆరోపణలు చేశారని, అధికారంలోకి వచ్చాక కూడా మళ్లీ విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్ తదితర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించి నాలుగేళ్లలో తన అవినీతిని నిరూపించాలని చెప్పారు. నిమ్మకాయల సుధారెడ్డి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి సంబంధించిన భూమిని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి కలిసి చెరువు భూమిగా ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేశారన్నారు. సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో వ్యాపారం చేసే అతన్ని తన భూమికి ఇవ్వాల్సిన అనుమతులు ఇవ్వకుండా ఆరు నెలలుగా మానసిక వేదనకు గురి చేస్తూ ఆత్మహత్య చేసుకునే స్థితికి తీసుకెళ్లారన్నారు. ఇది పట్టాభూమి అని చెరువుకు సంబంధించింది కాదని బ్రిటీష్ ప్రభుత్వంలోనే 1923లో నాటి కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని తహసీల్దార్ కూడా పత్రికా మూలకంగా ప్రకటన చేశారని రాచమల్లు పేర్కొన్నారు. అయినా ఆర్డీఓ ద్వారా అనుమతులు ఇవ్వకుండా ఎమ్మెల్యే అడ్డుకున్నారని తెలిపారు.

**కొండారెడ్డి ప్రమాణాలకు నిబద్ధత లేదు**

రాధా స్వామి సాక్షిగా తాను ఇప్పటి వరకు అవినీతి డబ్బు తీసుకోలేదని కొండారెడ్డి చెప్పిన మాటలపై రాచమల్లు అభ్యంతరం తెలిపారు. కొండారెడ్డి చేసే ప్రమాణం నిబద్ధతగా లేదన్నారు. వ్యాపారస్తులను రూ.15 కోట్లు డబ్బు అడిగిన మాట వాస్తవం అని చెప్పారు. భూమి విషయంలో కొండారెడ్డి డబ్బు అడగలేదని నిమ్మకాయల సుధాకర్‌రెడ్డితో ప్రెస్‌మీట్ పెట్టించారని రాచమల్లు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు రూ.కోట్ల విలువైన పనులు చేశారని తెలిపారు.

**గెలుపోటములు సహజం**

వరదరాజులరెడ్డి ఇప్పటి వరకు 11 సార్లు వివిధ ఎన్నికల్లో పోటీ చేసినట్లు రాచమల్లు చెప్పారు. అందులో 6 సార్లు గెలిచి 5 సార్లు ఓడిపోయారన్నారు. గెలుపు ఓటములు సహజమని, ఓటమిని అపహాస్యంగా మాట్లాడరాదని హితవు పలికారు. ఎమ్మెల్యే, కొండారెడ్డిపై ఎన్నో అవినీతి ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. డీఏడబ్ల్యూ కాలేజీ స్థలం విషయంలో పైరవీ చేసి రూ. 30 కోట్లు విలువ చేసే 3–4 ఎకరాల భూమిని ఎమ్మెల్యే వరద తీసుకున్నారని విమర్శించారు. విజయవాడలో వివాదాస్పద ఆస్తిని కొనుగోలు చేసిన ఘటనలో ఆడిటర్‌ను సజీవ దహనం చేశారని రాచమల్లు ఆరోపించారు. మల్లేల లింగారెడ్డి గెలుపునకు సహకరించాననే కారణంతో 2010లో తనను కొండారెడ్డి చంపడానికి ప్రయత్నించారని రాచమల్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ బి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్లు ఖాజా, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సరుకుల పరేషాన్

- పంపిణీలో డీలర్ల చేతివాటం!
- సరకుల్లో కోత, కిలో చక్కెరపై రూ.3 అదనపు వసూలు

దువ్వూరు(చాపాడు): దువ్వూరు మండల పరిధి గుడిపాడు గ్రామంలోని రెండు చౌక దుకాణాలలో నిత్యావసర సరకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు చౌక దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల రేషన్ పంపిణీలో 100 కార్డులకు మాత్రమే సరకులు పంపిణీ చేసి మిగిలిన వారికి ఇవ్వకుండా ఆపేశారు. ఒక షాపులో కిలో కంది పప్పు ఇస్తే, బియ్యంలో 3 కిలోల తగ్గించి ఇస్తుండగా, రూ.17లకు ఇవ్వాల్సిన కిలో చక్కరకు రూ.20 రాబడుతున్నాడు. మరో షాపులో కంది బేడలు ఇవ్వకుండా కేవలం బియ్యం మాత్రమే ఇస్తూ కిలో చక్కెరకు రూ.20 తీసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇది కూడా చౌకదుకాణం పరిధిలోని లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఇవ్వకుండా సగం మందికే ఇచ్చి సరకులు లేవని చెబుతున్నారని స్థానికలు అంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**డిప్యూటీ తహసీల్దారు ఏమన్నారంటే..**

గుడిపాడులోని రెండు చౌక దుకాణాలలో అస్తవ్యస్తంగా జరుగుతున్న నిత్యావసర సరకుల పంపిణీపై డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్‌ను వివరణ కోరగా.. సరకుల పంపిణీపై విచారణ చేసి సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గడ్డిని చుట్టి.. అవస్థలు తీర్చి

గతంలో పొలాన్ని కొడవలితో కోసి, కల్లం చేసి, గడ్డిని వాములు చేసుకునేటోళ్లు. రైతు బతికేందుకు పంట పండించుకున్నట్టే.. అన్నదాతకు చేదోడు, వాదోడుగా ఉండే పశువులకు మళ్లీ పంటవచ్చే దాకా వరి గడ్డిని నిల్వ చేసుకునేటోళ్లు. అనంతరం హార్వెస్టర్లు వచ్చి సగం పని తప్పించినా.. కోసిన గడ్డిని కుప్ప పెట్టుకునేందుకు ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ట్రాక్టర్లకు అమర్చిన యంత్రం చెల్లాచెదరుగా పడిఉన్న పశుగ్రాసాన్ని కట్టల్లా చుట్టేస్తోంది. వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకీకరణ రైతులకు ఎంతో పని, శ్రమ, సమయాభావాన్ని తగ్గిస్తోంది. గడ్డిని కట్టలుగా చుట్టి సేకరిస్తుండడం వలన ఇటు రైతులకు అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా మారింది. ఈ పద్ధతి అనుకూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. నెల్లూరు, శ్రీకాళహస్తి, టంగుటూరు, వెలవలి గ్రామాల నుంచి వచ్చిన మిషన్ యజమానులు ఒక్కో కట్టకు రూ.25 నుంచి రూ.30 వరకు డబ్బులు తీసుకుంటున్నారు. –రాజుపాలెం


పొలంలో పశుగ్రాసం కట్టలు


చెల్లాచెదురుగా ఉన్న గడ్డిని మిషన్‌తో చుట్టలు కడుతున్న ట్రాక్టర్


కట్టలు కట్టిన గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతులు

## ఉత్సాహంగా రాయలసీమ సంగీత నృత్యోత్సవాలు


నృత్యరత్న, మణిదీపిక అవార్డులు అందుకున్న చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో రెండో రోజు ఆదివారం రాయలసీమతో పాటు పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ఆధునిక జీవనంలో యువత మన సంప్రదాయాలు మరచిపోతున్నారన్నారు. పట్టణంలో ప్రప్రథమంగా ఈ ఉత్సవాలను నిర్వహించడం హర్షణీయమని నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు నాట్యవిశారద మోహిద్దీన్ ఖాన్‌ను అభినందించారు. పలువురు నృత్యకారులకు రాయలసీయ నృత్యరత్న, రాయలసీమ సంగీతరత్న అవార్డులను అతిథులు అందజేశారు. పలువురు నృత్యకారులకు రాయలసీమ నృత్యరత్న, రాయలసీమ సంగీతరత్న అవార్డు ఇచ్చారు. అలాగే విద్యార్థులకు రాయలసీమ మణిదీపిక అవార్డులను అందించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమి రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ఎస్వీ సంగీత నృత్యకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్.జమునారాణి, నాట్య కళాప్రపూర్ణ డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు.

## ధరల మంట.. పండుగ చేసుకొనేదెట్టా!

- సంక్రాంతి రోజు తప్పని.. పచ్చడి మెతుకులు
- పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు
- ఆందోళనలో ప్రజలు



కాశినాయన : నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో పేద, మధ్యతరగతి ప్రజలు సంక్రాంతి పండుగను పచ్చడి మెతుకులతో జరుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు ఒక వ్యక్తికి 5 కిలోల బియ్యం ఇస్తుంది. అవి ఎటూ సరిపోవు. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ కొబ్బెర రూ.240, బెల్లం కేజీ రూ.60, చక్కెర రూ.42, శనగపిండి రూ.110, చింతపండు రూ.130, పామాయిల్ నూనె రూ.150, వెల్లుల్లి రూ.360, వేరుశెనగ నూనె రూ.220, సన్‌ఫ్లవర్ నూనె రూ.180 వంతున ధరలు పెరిగిపోయాయి. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు నిత్యావసర వస్తువులు కొనాలంటే భయపడుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో సామాన్య ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సంక్రాంతి పండుగకు ప్రతి ఏటా రైతులకు ధాన్యం ఇంటికి చేరుతుంది. ఈ సంవత్సరం దానికి భిన్నంగా పరిస్థితి తయారైంది. అరకొరగా వస్తున్న నీటితో పంటలను సాగు చేస్తే చేతికందకుండా పోయాయి. ఏది ఏమైనా ఈ ఏడాది సంక్రాంతి పండుగను ప్రజలు మొక్కుబడిగా జరుపుకోనున్నారు.

## బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు


కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

మైదుకూరు : మండలంలోని ఎస్.ఎర్రబల్లి పంచాయతీ పరిధిలో ఉన్న జ్యోతినగర్‌లో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇటీవల గ్రామానికి చెందిన చుక్కా రిషితేష్ అనే 8 ఏళ్ల బాలుడిపై ఓ కుక్క దాడి చేశాయి. గ్రామంలో ఇప్పటికే ఐదుగురిని కుక్కలు గాయపరిచిన సంఘటనలు జరిగాయి. కొద్ది రోజుల కిందట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఓ ఉద్యోగిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచినట్టు గ్రామస్తులు తెలిపారు. కుక్కలు గ్రామంలో గుంపులుగా తిరుగుతూ బెంబేలెత్తిస్తున్నాయని వారు వాపోయారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో గ్రామంలో పిల్లలు ఇంటి వద్దనే ఉంటున్నారని, వీధిలో ఆడుకునేందుకు వెళితే కుక్కలు దాడి చేస్తున్నాయని తెలిపారు. పిల్లలను బయటకు పంపాలంటేనే భయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బెడదను తప్పించాలని జ్యోతినగర్ గ్రామస్తులు కోరుతున్నారు. కాగా పంచాయతీలోని సుంకులుగారిపల్లెలో కూడా కుక్కలు స్వైర విహారం చేస్తూ హడలెత్తిస్తున్నాయని స్థానికలు తెలిపారు.

## సంఘమేశ్వర ఆలయం.. ఉత్సవాలకు శ్రీకారం


సంఘమేశ్వర స్వామి ఆలయం

చాపాడు: మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో వెలసిన పార్వతిదేవి సమేత సంఘమేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఈ నెల 13, 14, 15వ తేదీలలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు బోగి రోజైన సోమవారం రాత్రి సాంస్కృతి కార్యక్రమాలు డాన్స్‌ప్రోగ్రాం, 14న మంగళవారం రాత్రి గణేష్ ఈవెంట్స్ వారితో కల్చరల్ ప్రోగ్రాం, ఇదే క్రమంలో ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి పారితోషికం ఇవ్వనున్నారు. 15న బుధవారం కనుమ సందర్భంగా మధ్యాహ్నం నుంచి కోలాట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**15న రెండు గ్రామాల్లో బండలాగుడు పోటీలు**

సంక్రాంతి కనుమ రోజున వెదురూరు, నరహరిపురం గ్రామాలలో రాష్ట్ర స్థాయిలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు రూ.1,00,116లు, రూ.70,115లు, రూ.40,116లు, రూ.20,116లు, రూ.10,116లు చొప్పున ఆయా గ్రామాల్లోని నిర్వాహకులు నగదు బహుమతులు అందజేయనున్నారు. రాత్రి 9.30గంటల నుంచి గ్రామోత్సవ వేడుకలు జరుపనున్నారు.

**కామనూరులో..**

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కామనూరు గ్రామంలో సోమవారం నుంచి గురువారం వరకు శ్రీప్రసన్నవేణుగోపాలస్వామి, శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు, పార్వేట మహోత్సవం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం ఉదయం 8 గంటలకు 15 ఏళ్ల లోపు వారికి జూనియర్ కబడ్డీ పోటీలు, 10 గంటలకు ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పందెం, మధ్యాహ్నం 2 గంటలకు స్లో బైక్ రైడ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేస్తారు. రాత్రి 7 గంటలకు రేలా రే లారే అరుణ్ ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మకర సంక్రాంతి పండుగ రోజు మంగళవారం 15 ఏళ్లు పైబడిన వారికి సీనియర్ కబడ్డీ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తారు. బుధవారం ఉదయం 9 గంటలకు సీనియర్ కేటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. ఈపోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమాలనుకు బహుమతులు ప్రదానం చేస్తారు.

### సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలి


ఎమ్మెల్సీ గోవిందరెడ్డి


ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు: ఈ సంక్రాంతి పండుగ బద్వేలు నియోజకవర్గ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆకాంక్షించారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలు.. అందరూ ఆనందంగా జరుపుకోవాలని మనసారా కోరుకున్నారు. అందరికీ దైవానుగ్రహం సంపూర్ణంగా ఉండాలని, ఈ సంక్రాంతి రైతుల ఇళ్లలో సిరులు కురిపించాలని కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

### క్యాలెండర్, బ్రోచర్ ఆవిష్కరణ



ఇంద్రప్రస్థ వెంచర్-విల్లా బ్రోచర్, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు (చాపాడు): మైదుకూరు పట్టణంలో నగర స్థాయిలో డీటీసీపీ అనుమతితో ఇంద్రప్రస్థ పేరుతో విల్లా–ప్లాట్ గెటెడ్ కమ్యూనిటీ వెంచర్ ఏర్పాటు శుభపరిణామమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మైదుకూరు పట్టణంలో నంద్యాల రోడ్డులో ఎంఎల్ఎస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంద్రప్రస్థ వెంచర్, బ్రోచర్, నూతన క్యాలెండర్‌లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మైదుకూరులో హైదరాబాదు, బెంగుళూరు వంటి నగర స్థాయిలో వెంచర్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచడం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంఎల్ఎస్ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాదులో ఎన్నో విల్లాలను నిర్మించిన అనుభవంతో సొంతగడ్డ మైదుకూరులో నాణ్యమైన గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో 22.10 ఎకరాలలో అన్ని అనుమతులతో స్థలాన్ని సేకరించి 2.10 ఎకరాలు పార్క్, ఆట స్థలం ఏర్పాటు చేసి, 40 అడుగుల విశాలమైన రోడ్లు నిర్మించి వెంచర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మైదకూరు, చాపాడు తహసీల్దారు రాజసింహ, రమాకుమారి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, కేసీ కెనాల్ పీసీ వైఎస్ చైర్మన్ గురివిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు పాల్గొన్నారు.

### ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


అనుమతులు లేకుండా చెట్లు తొలగిస్తున్న వారిని హెచ్చరిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్ సమీపంలో గల చపాతిగ్రౌండ్ వద్ద సర్వే నెంబర్ 914లో ఉన్న 03.08 సెంట్ల మున్సిపాలిటీ స్థలాన్ని హెచ్చరిక బోర్డును తొలగించి అక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం పట్టణ ప్రణాళిక అధికారులను పంపి తిరిగి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

**చెట్లను నరికితే చర్యలు**

మున్సిపాలిటీ పరిధిలో అధికారుల అనుమతి లేకుండా ఎవరైనా చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె వద్ద అనుమతులు లేకుండా చెట్లను నరికిన వారికి రూ.2 వేలు జరిమానా విధించారు.

### వైద్యుడి నియామకం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆయుష్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ వైద్యుడిగా ప్రభుత్వం తనను నియమించిందని పట్టణానికి చెందిన హోమియోపతి డాక్టర్ గుర్రం లక్ష్మీనరసయ్య తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తాను, తన భార్య డాక్టర్ లోకేశ్వరి 15 ఏళ్లుగా హోమియోపతి వైద్యులుగా పట్టణంలో సేవలందిస్తున్నామని తెలిపారు. తాను కడప హోమియో వైద్యకళాశాలలో సహాయ ప్రొఫెసర్‌గా 10 ఏళ్లు పనిచేశానని పేర్కొన్నారు.